### మావోయిస్టుల ఘాతుకం

# సీఆర్‌పీఎఫ్ ఎస్సై హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 17: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు జరిపిన మెరుపుదాడిలో ఓ భద్రతా అధికారి మృతిచెందగా, జవాన్‌కు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జగర్‌గూండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్గత ప్రాంతం నుంచి సీఆర్‌పీఎఫ్ 165 బెటాలియన్ భద్రతా దళాలు ఉర్సుగల్ వైపు సెర్చింగ్ ఆపరేషన్‌కి బయలుదేరాయి. ఈక్రమంలో భద్రతా దళాలపై అంబుష్ వేసిన మావోయిస్టులు ఒక్కసారిగా మెరుపుదాడి చేశాయి. జవాన్లపై కాల్పుల వర్షం కురించడంతో కాసేపటికి తేరుకున్న జవాన్లు అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిపారు. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు పారిపోయారు. అప్పటికే మావోయిస్టుల దాడిలో గాయపడిన సీఆర్‌పీఎఫ్ ఎస్సై సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. మరో జవాన్ రాము తీవ్రంగా గాయపడడంతో అతనికి ప్రాథమిక చికిత్స అందించిన తోటి జవాన్లు మెరుగైన చికిత్స నిమిత్తం ఎయిర్‌లిఫ్టర్‌తో రాయ్‌పూర్‌కు తరలించారు. గాలింపులను ముమ్మరం చేసి భద్రతా దళాలు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎస్సై సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని హెడ్‌క్వార్టర్స్‌కి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# జనావాసాల్లోకి వానర దండు

**ఆదమరిచి ఉంటే అంతే సంగతులు**

**ఇంట్లో ఆహార పదార్థాలు మాయం**

**చేలల్లోకి వచ్చి కూరగాయలు, పండ్ల తోటలు ధ్వంసం**

**సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు**





మాచినేనిపేటలో కోతలు పూర్తయిన వరి పొలంలో సంచరిస్తున్న వానరాలు

జూలూరుపాడు, డిసెంబర్ 17: వానర దండు జూలూరుపాడు మండలంలోని గ్రామాలపై దండెత్తి వస్తున్నాయి.. ఇళ్లలోకి చొరబడి నచ్చిన ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి.. రైతులు సాగు చేస్తున్న పండ్లు, కూరగాయల తోటలను ధ్వంసం చేస్తున్నాయి.. మండలం ఆటవీప్రాంతానికి దూరంగా ఉన్నప్పటికీ అడవిలో ఆహారం దొరక్క వానరాలు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇంటి పైకప్పులు, రేకుల షెడ్లపై ఎక్కి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదమరిచి ఇంటి తలుపులు వేయకుండా ఉంటే ఇంటిని కొల్లగొడుతున్నాయి. క్షణాల్లో ఆహార పదార్థాలను మాయం చేసి ఉడాయిస్తున్నాయి.

**పంట దిగుబడులపై ప్రభావం..**

కోతులు గుంపులు గుంపులుగా గ్రామాల్లోకి వస్తున్నాయని, పంటల దిగుబడిపైనా వాటి ప్రభావం కనిపిస్తున్నదని మండలానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము సాగు చేస్తున్న కూరగాయలు, పండ్ల తోటలను ధ్వంసం చేస్తున్నాయంటున్నారు. పిందె దశలో ఉండగానే కాయలను తెంపేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తినేందుకు పనికిరాని పత్తికాయలనూ వదలడం లేదంటున్నారు. కోతల నుంచి పంటను కాపాడేందుకు పొలాల వద్ద ప్రత్యేకంగా ఒక మనిషిని కాపలా ఉంచాల్సి వస్తుందంటున్నారు. రేయింబవళ్లు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయంటున్నారు.

**చేతిలో కర్ర, ఉండేలు తప్పనిసరి..**

కోతుల బెడదకు తాళలేక గ్రామస్తులు ఇంటికొకరు కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎవరోఒకరు ఉండేలు, కర్ర చేత పట్టుకొని వానరాలను అదిలించాల్సి వస్తున్నది. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నా వెంగన్నపాలెం, జూలూరుపాడు గ్రామాల కోతుల బెడద ఎక్కువగా ఉంది. కిరాణా దుకాణాలు, ఇండ్లు.. ఇలా దేన్నైయినా కోతులు వదలడం లేదు. వాటి బెడద నుంచి విముక్తి కల్పించాలని, ఎవరికి ఫిర్యాదు చేసినా స్పందన లేదని, అధికారులెవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులైనా స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## సుదర్శన హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పురోహితులు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 17: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమాన్ని యజ్ఞాచార్యులు గిరిధరాచార్యులు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో ధనుర్మాస వైకుంఠ, ఏకాదశి అధ్యయనోత్సవాలను అర్చకులు ప్రారంభించారు.

## పీఆర్‌టీయూ సభ్యుడికి ఆర్థిక సాయం



చెక్కు ఇస్తున్న నాయకులు

టేకులపల్లి, డిసెంబర్ 17: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని చింతోనిచెలక యూపీఎస్ ఉపాధ్యాయుడు, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి టి.సర్కార్‌కు నాయకులు, తోటి ఉపాధ్యాయులు అండగా నిలిచారు. ఆయన వైద్య ఖర్చులకు ఆదివారం రూ.1.10 లక్షలకు చెక్కును పాల్వంచలోని ఇంటి వద్ద కుటుంబీకులకు అందించారు. జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, నాయకులు బి.రవి, జి.మోతీలాల్, టి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'సింగరేణిని సమాధి చేస్తున్నారు'



మాట్లాడుతున్న నాయకులు

టేకులపల్లి, డిసెంబర్ 17: సింగరేణి లాభాలను కార్పొరేట్లకు కట్టబెట్టడం ఆ సంస్థను ఒకవైపు యాజమాన్యం, మరోవైపు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమాధి చేస్తున్నాయని విప్లవ కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం కోయగూడెం ఉపరితల గనిలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. లాబాల్లో సాగుతున్న సింగరేణిని కాపాడాలని, కొత్తగా బొగ్గు బావుల తవ్వకం ద్వారా మరింతమందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. సాదినేని వెంకటేశ్వర్లు, జనార్దన్, సీతారామయ్య, మహ్మద్ రాసుద్దీన్, ప్రసాద్, గవిని నాగేశ్వరరావు, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు

ములకలపల్లి, డిసెంబర్ 17: పాల్వంచకు చెందిన విజయ కేర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ఆదివారం ములకలపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. దాదాపు 150 మంది రోగులను వైద్యులు పుల్లూరు ప్రణయ్ పరీక్షించి మందులు ఇచ్చారు. సర్పంచ్ బీబినేని భద్రం, ఉప సర్పంచ్ శెనగపాటి అంజి, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య, వాసవీక్లబ్ అధ్యక్షుడు బిక్కుమళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ముత్యాలంపాడు క్రాస్ రోడ్‌లో..**

టేకులపల్లి, డిసెంబర్ 17: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని వీ-కేర్ హాస్పిటల్ నిర్వహించింది. సర్పంచ్ మాలోత్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**వినాయకపురంలో..**

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 17: మండలంలోని వినాయకపురం గ్రామంలోగల లిటిల్ బర్డ్ స్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైరా లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసింది. దీనిని ఎంపీటీసీ సభ్యురాలు మారుతి లలిత, ఉప సర్పంచ్ నల్లపు లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు దుబగుంట్ల దుర్గారావు, రీజనల్ చైర్మన్ కోటారు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు ఎంపిక



రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీకి ఎంపికైన క్రీడాకారులు

ములకలపల్లి, డిసెంబర్ 17: మండలంలోని కమలాపురం పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు, పీఈటీ ఎస్.వీరభద్రం, టీపీ-2ఏ నరసింహ ఆదివారం అభినందించారు.

## 'మున్నూరుకాపు' కమిటీ ఎన్నిక

చంద్రుగొండ, డిసెంబర్ 17: మున్నూరుకాపు సంఘం మండల నూతన కమిటీని ఆదివారం స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగిన విస్తృత స్థాయి సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా రామిశెట్టి సైదయ్య, ప్రధాన కార్యదర్శిగా వెలగల మధు, ఉపాధ్యక్షుడిగా రంగిశెట్టి రామరావు(రాము), కోశాధికారిగా అంచ కృష్ణ, సహాయ కార్యదర్శిగా కూసాల లక్ష్మీపతి, సభ్యులుగా గోరింట్ల శ్రీనివాసరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, గాజుల ప్రసాద్, బోగి కృష్ణ, ఆకుల రాంబాబు, ఆళ్ల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా లంకా నరసింహారావు, సలహాదారుగా శెట్టిపల్లి కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

పాల్వంచ రూరల్, డిసెంబర్ 17: క్రిస్మస్ పండుగ సమీపిస్తున్న సందర్భంగా పాల్వంచ ఏసు కరుణ సువార్త మందిరం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆదివారం ఉల్వానూరు పరిసర ప్రాంతాలకు చెందిన గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సురేశ్ పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలు




కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, డిసెంబర్ 17: దమ్మపేట మండలం సుధాపల్లి గ్రామంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కేక్ కట్ చేశారు. క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ సోయం ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు పాల్గొన్నారు.

**మసీదుల అభివృద్ధికి విజ్ఞప్తి**

అశ్వారావుపేట, డిసెంబర్ 17: అశ్వారావుపేటలోని మసీదుల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ముస్లిం నాయకులు విజ్ఞప్తి చేశారు. వారు ఆదివారం దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఎమ్మెల్యేను స్వగృహంలో కలిశారు. సర్దార్, పాషా, షాకీర్, షరీఫ్, బాజీ పాల్గొన్నారు.

**పంచాయతీ కార్మిక సంఘం సత్కారం**

ములకలపల్లి, డిసెంబర్ 17: ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మండల పంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఆదివారం శాలువా కప్పి సత్కరించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. గంటా శ్రీనివాసరావు, చిటికె రామకృష్ణ, అవులూరి రాంబాబు, గద్దల మహేష్, బానోత్ శంకర్, సాయిరత్న, సెనగాని శంకర్, ఉగ్గల దారయ్య, బయటి అశోక్‌నారాయణ పాల్గొన్నారు.

## యువకుని ఆత్మహత్య

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 17: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో మృతిచెందాడు. కొమరారం పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బోయి తండా పంచాయతీ తూంటబాల తండా గ్రామస్తుడు బానోత్ నగేష్(26), కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు, స్థానికులు వెంటనే ఇల్లెందు వైద్యశాలకు తరలించారురు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సలహాతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అతడు అక్కడే ఆదివారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయానికి ఇన్వర్టర్

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 17: మండలంలోని వినాయకపురం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి తిరుమలకుంట గ్రామస్తుడు కక్కిరాల లక్ష్మినారాయణ ఆదివారం ఇన్వర్టర్‌ను అందజేశారు. ఆయనకు ఆలయ బాధ్యులు ఉప్పల ప్రసాద్, మురళి కృతజ్ఞతలు తెలిపారు.

## పద్మశాలీల వనసమారాధన

పాల్వంచ, డిసెంబర్ 17: పాల్వంచ పట్టణంలోని ఆడమ్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ఆదివారం పద్మశాలి సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో వన సమరాధన మహోత్సవం జరిగింది. వేడుకలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నిర్వాహకులు దోమల ప్రవీణ్, రాము, గుండు శ్యాం, రవికుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

## వైద్యశిబిరానికి విశేష స్పందన

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 17: సీఎస్‌ఈ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల కోసం ఆదివారం జిల్లాకేంద్రంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. వైద్యనిపుణులు, సిబ్బంది సుమారు 500 మంది కార్మికులకు 51 రకాల వైద్య పరీక్షలు చేసి హెల్త్ రిపోర్టులు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ అక్బర్, క్యాంప్ ఇన్‌చార్జి జి.మహేశ్, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షుడు గాజుల రాంచందర్ పాల్గొన్నారు.